

ఆరోగ్య 'యోగ'ం
యోగాకు ఆదరణ పెరుగుతోంది. ప్రజల్లో చాలా మంది యోగాసనాలు వేస్తూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటున్నారు.
8లో▸



సేవాభావంతో పనిచేయాలి
రెవెన్యూ ఉద్యోగులు సేవాభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. రెవెన్యూ డేను పురస్కరించుకొని శుక్రవారం వేడుకలు నిర్వహించారు.
8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,613.03
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 42.892
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 50,686
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 256

న్యూస్‌రీల్

క్వింటా పత్తి రూ.8,025



అమ్మకానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా పత్తి ధర రూ.8 వేలు దాటింది. యార్డులో అమ్మకానికి రైతులు 300 క్వింటాళ్ల పత్తి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.8,025, మధ్య ధర రూ.7,689, కనిష్ట ధర రూ.4,511 నమోదైంది. అదేవిధంగా వేరుశనగ కాయలు 16 క్వింటాళ్లు రాగా గరిష్ట ధర రూ.5,682, కనిష్ట ధర రూ.4,800 లభించింది.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

కర్నూలు(సెంట్రల్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాలో 5,264 వేదికల్లో 12లక్షల మందితో యోగాసనాలు వేయిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతనెల మే 21 నుంచి యోగాంధ్ర పేరిట గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పలు కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జూన్ 21న శనివారం జిల్లా వ్యాప్తంగా 5,264 వేదికల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. జిల్లా స్థాయిలో నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో 5వేల మందితో యోగా కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి మొదలవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్కూళ్లలోనే విద్యార్థులకు అల్పాహారం

కర్నూలు సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నేటి(శనివారం)ఉదయం 8.30 గంటలకు విద్యార్థులకు స్కూళ్లలోనే అల్పాహారం అందించాలని డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు యోగాంధ్ర కార్యక్రమం తరువాతే ఉప్మా, చెట్నీ తయారు చేయించాలన్నారు. విద్యార్థులకు అల్పాహారం అందించే ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అల్పాహారం ఎట్టి పరిస్థితుల్లో యోగాకు ముందు ఇవ్వకూడదని డీఈఓ పేర్కొన్నారు.

రానున్న ఐదు రోజుల్లో తీవ్ర గాలులు

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజులు అధిక ఉష్ణోగ్రతలు, గాలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ఒకటి, రెండు ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉందన్నారు. ఇదిలాఉంటే వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. మే నెలలో అధిక వర్షాలు కురిశాయి. జూన్ నెలలో ఒకటి, రెండు రోజుల పాటు వర్షాలు కురిసినప్పటికీ అనావృష్టి పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. గాలి తీవ్రత పెరిగింది. ఈ నెల 25 వరకు బలమైన గాలులు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడం గమనార్హం. ఈ నెల 21న 1.2 మి.మీ, 22న 1.0 మి.మీ, 23 నుంచి 25 వరకు 0.5 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు ప్రకటించారు. ఉష్ణోగ్రతలు వేసవి తరహాలో 37 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాలి వేగం 21 నుంచి 22 కిలోమీటర్లు ఉండే అవకాశం ఉంది. మరో మూడు నాలుగు రోజుల్లో వర్షాలు లేకపోతే ప్రధానంగా సాగు చేసిన పత్తి పంట దెబ్బ తినే పరిస్థితి నెలకొంది.

విషమించిన మిర్చి!

మిర్చిలో పురుగుమందుల అవశేషాలు
- చీడపీడల నియంత్రణకు అడ్డగోలు వినియోగం
- ఎకరాకు రూ.54 వేల నుంచి రూ.60 వేల ఖర్చు
- అత్యంత ప్రమాదకర మందుల విక్రయాలు
- లాభాల కోసం ప్రోత్సహిస్తున్న డీలర్లు
- ఎగుమతులపైనా తీవ్ర ప్రభావం
- ఈ కారణంగానే పతనమవుతున్న ధర

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోనే అత్యధికంగా మిర్చి ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే సాగవుతోంది. పురుగు మందుల వినియోగం అధికమవడంతో రైతులకు పెట్టుబడి వ్యయం తడిసి మోపెడవుతోంది. ఇదే సమయంలో మిర్చిలో పురుగు మందుల అవశేషాల కారణంగా ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఇకపోతే ఈ కారణంగానే ఎగుమతులు కూడా పడిపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల గుంటూరు నుంచి వ్యాపారులు 60 కంటైనర్లలో 900 టన్నుల మిర్చి చైనాకు ఎగుమతి చేశారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో మిర్చిలో పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు గుర్తించి వెనక్కు తీసుకెళ్లాలని చెప్పినట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పండించిన మిర్చి ప్రధానంగా గుంటూరు యార్డుకు తరలుతోంది. ధర లేకపోవడంతో 80 శాతం పంటను అక్కడి ఏసీ గోదాముల్లోనే నిల్వ చేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మిర్చి సాగు బాగా కలిసొచ్చింది. 2022-23లో ఉమ్మడి జిల్లాలో 1,29,575 ఎకరాల్లో మిర్చి సాగయింది. ఆ ఏడాది ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. బ్యాడిగ రకాలకు క్వింటాకు రికార్డు స్థాయిలో రూ.56 వేల వరకు ధర పలికింది. 2024-25లో ఉమ్మడి జిల్లాలో 1,17,868 ఎకరాల్లో మిర్చి సాగయింది. సాగు తగ్గినప్పటికీ చీడపీడలు, వైరస్ తెగుళ్లు, నల్లతామర ప్రభావం తీవ్రంగా ఉండటంతో పురుగుమందుల వినియోగం భారీగా పెరిగింది.



మిర్చి తోటలో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

దేశంలోనే 5వ స్థానం	ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2023-24తో పోలిస్తే.. 2024-25లో పురుగు మందుల వినియోగం భారీగా పెరిగింది. 2023-24లో 2.92 లక్షల లీటర్ల పురుగుమందులు వినియోగించినట్లు తెలుస్తోంది. 2024-25లో ఏకంగా 3,61,355 లీటర్ల పురుగుమందులు వినియోగించడం గమనార్హం. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగంలో నంద్యాల జిల్లా దేశంలోనే 5వ స్థానంలో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.
28 దఫాలుగా పురుగు మందుల పిచికారీ	పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామం మిర్చి సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ మిర్చి సాగుకు మల్చింగ్ కూడా వినియోగిస్తారు. ఈ గ్రామానికి చెందిన ఒక రైతు గత ఏడాది 4 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. అయితే నల్ల తామర తీవ్రత పెరిగిపోవడం, పంటకు నష్టం తీవ్రత ఎక్కువగా ఉండటంతో నాలుగు రోజులకోసారి పురుగు మందులు పిచికారీ చేశారు. ఒక సీజన్‌లోనే 28 దఫాలు పురుగు మందులు పిచికారీ చేయడం గమనార్హం. ఇందుకోసం ఎకరాకు రూ.60 వేల వరకు ఖర్చు చేశారు.

20-25 దఫాలుగా పురుగుమందుల వినియోగం

మిర్చి పంట నాట్లు మొదలుకొని చివరి కోత వరకు ఆరు నెలలు ఉంటుంది. ఈ మధ్య కాలంలో 20 నుంచి 25 దఫాలుగా పురుగుమందులు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మంత్రాలయం, పెద్దకడుబూరు, గోనెగండ్ల, కోడుమూరు, దేవనకొండ, హొళగుంద, ఆదోని, సి.బెళగల్, ఓర్వకల్, ఆలూరు, కొత్తాళం, కోసిగి మండలాలు.. నంద్యాల జిల్లాలో రుద్రవరం, శిరువెళ్ల, ప్యాపిలి, అవుకు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు తదితర మండలాల్లో మిర్చి సాగవుతోంది. ఒక్కో దఫా పురుగు మందులు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ.3వేల పైనే ఖర్చు అవుతుంది. దీన్ని బట్టి చూస్తే ఎకరాకు కేవలం పురుగు మందులపైనే రూ.54 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు చేస్తుండటం గమనార్హం.



మిర్చి దిగుబడి

డీలర్ల ఇష్టారాజ్యం

మిర్చి రైతులు పురుగుల నియంత్రణకు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. డీలర్లు అమ్మకాలను పెంచుకునేందుకు రెడ్, ఎల్లో లేబుల్ పురుగుమందులనే అధికంగా అంటగడుతున్నట్లు తెలుస్తోంది. గ్రీన్ లేబుల్ పురుగుమందులు వినియోగించేలా డీలర్లు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ ఆ దిశగా ప్రోత్సహించకపోవడం వల్లే పురుగుమందుల వినియోగం పెరిగిపోతోంది. మిర్చి సహా అన్ని పంటల్లో గ్రీన్ లేబుల్ పురుగుమందులను వినియోగిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడుకునే వీలుంటుంది. అయితే గ్రీన్ లేబుల్ పురుగుమందుల వినియోగం అతి తక్కువగా అంటే 10-20 శాతం ఉండగా.. రెడ్, ఎల్లో, బ్లూ లేబుల్ పురుగుమందుల వినియోగం 80-90 శాతం వరకు ఉంటోంది.

పురుగు మందుల్లో విష తీవ్రత ఇలా..



రెడ్ లేబుల్: ఇవి అత్యంత విషపూరితమైనవి. మోనోక్రోటోఫాస్, జింక్ ఫాస్పేట్, ఇథైల్, మెర్క్యూరి అసిటేట్ వంటివి.



బ్లూ లేబుల్: ఈ లేబుల్ కలిగిన పురుగుమందుల్లో విష ప్రభావం మధ్యస్తంగా ఉంటుంది. స్పైనోశాడ్, మలాథియాన్, థిరామ్, గ్లైఫోసేట్ తదితరాలు.



ఎల్లో లేబుల్(డేంజర్): ఇవి కూడా అత్యంత విషపూరితమైనవే. వీటి ఉత్పత్తిని తగ్గించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఓమైట్, అవాంట్, ఎండోసల్ఫాన్, కార్బరిల్, క్వినాల్ ఫాస్, సైఫర్‌మెత్రిన్, ఫిప్రోనిల్, రోగార్ వంటివి



గ్రీన్ లేబుల్(హెచ్చరిక): ఈ లేబుల్ పురుగుమందుల్లో విష ప్రభావం తక్కువగా ఉంటుంది. ఆహార పంటలకు వీటినే వినియోగించాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. మాంకోజెబ్, అక్సిఫ్లోర్ఫెన్, కొరాజిన్, వేపనూనె తదితరాలు.

“ సేంద్రియ ఎరువులతోనే పంటల్లో నాణ్యత



రసాయన ఎరువులు మితిమీరి వినియోగిస్తుండటంతో తెగుళ్లు, పురుగుల బెడద పెరుగుతోంది. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే తెగుళ్లు, పురుగుల తీవ్రత తగ్గుతుంది. అప్పుడు పురుగుమందుల వాడకం కూడా తగ్గించుకోవచ్చు. పురుగుమందులను వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకే వినియోగించాలి. గ్రీన్ లేబుల్ పురుగుమందులను సిఫారసులకు లోబడి వినియోగిస్తే మిర్చిలో నాణ్యత కూడా పెరుగుతుంది.

– సుజాతమ్మ, ప్రధాన శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం, కర్నూలు

ప్రజల దృష్టి మళ్లించేందుకే అక్రమ అరెస్టులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: “మా నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పల్నాడు పర్యటన కార్యక్రమం నుంచి జనం దృష్టి మరల్చేందుకే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని రాత్రికి రాత్రే బెంగళూరులో అరెస్టు చేశారు. అక్రమ కేసులు, అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయాలని కూటమి నేతల అవివేకం. ఇలాంటి వాటికి బెదిరేది లేదు’ అని కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. చిప్పగిరిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది నుంచి రాష్ట్రంలో అరాచక పాలనకు అంతులేకుండా పోయిందని, రెడ్‌బుక్ పేరిట అక్రమ అరెస్టులు చేయడం కూటమి నాయకులకే చెల్లిందన్నారు. జరగని స్కాంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరు చేర్చి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజల నుంచి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి భయపడి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో మీరు చేస్తున్న పాలనను ప్రజలు గమనిస్తున్నారనే విషయం తెలుసుకోవాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడున్నాడో తెలియదని, ఆయన ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఒక పక్క హత్యలు, హత్యాచారాలతో రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటనకు ప్రజలు రాకుండా ఎన్ని ఆంక్షలు విధించినా వారిని నిలువరించలేకపోయారన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

కర్నూలు(అర్బన్): పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో ఈ ఏడాది జనవరి నెలలో పూర్తయిన పనులకు ఈ నెలాఖరు నాటికి 50 శాతం బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పీఆర్ చీఫ్ ఇంజనీరు కె.విజయకుమారి తెలిపారు. నాణ్యత లోపిస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. శుక్రవారం ఆమె స్థానిక పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో పీఆర్ఐ, పీఐయూ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు రూ.26 కోట్లు విడుదల కానున్నాయన్నారు. మిగిలిన 50 శాతం బిల్లులను జూలై నెలాఖరు నాటికి విడుదల చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాబార్డు 30 కింద ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.43 కోట్లతో 29 పనులు మంజూరయ్యాయని, ఈ పనుల టెండర్లను వెంటనే పూర్తి చేసి అగ్రిమెంట్ తీసుకొని పనులను ప్రారంభించాలన్నారు. రూ.2 కోట్ల విలువైన పనులను 9 నెలల్లో, రూ.2 కోట్లకు పైబడిన పనులను 12 నెలల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పీఆర్ ఈఈ వి.రామచంద్రారెడ్డి, కర్నూలు, ఆదోని ఈఈలు సి.మద్దన్న, వెంకటేశ్వర్లు, డీఈఈలు రవీంద్రారెడ్డి, బండారు శ్రీనివాసులు, ధనిబాబు, శేషయ్య, హెచ్‌డీ ఈరన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో 23న యువత పోరు

- నిరుద్యోగులను దగా చేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

కర్నూలు (టౌన్): కర్నూలులో ఈనెల 23వ తేదీ యువత పోరు పేరుతో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 'యువత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. యువత కోసం ఏటా 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని.. లేదంటే తమ కాలర్ పట్టుకోవాలని నారా లోకేష్ పలు సమావేశాల్లో చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్కరికి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేయడంతో అరకొరగా తల్లికి వందనం నిధులు విడుదల చేశారని విమర్శించారు.

బెదిరిస్తే భయపడేది లేదు!

సూపర్ సిక్స్ హామీలు నేరవేర్చామని, ఏవరైనా ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలని చూస్తే వారి నాలుక మడత పెడతామని సీఎం చంద్రబాబు నాయుడు బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని ఎస్వీ అన్నారు. ముఖ్యమంత్రి బెదిరిస్తే ఇక్కడ ఎవరూ భయపడే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రూ. 3 వేలు ఇచ్చారా.. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ. 1500, 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీలకు పెన్షన్ రూ. 4 వేలు, అన్నదాత సుఖీభవ రూ. 20 వేలు ఇలా.. సూపర్ సిక్స్ కింద ఇస్తామని ఈ పథకాలన్నీ ఎందుకు అమలు చేయడం లేదన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యువత పోరు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి తెలిపారు. ఏడాది దాటినా ఫీజు బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువకులు, నిరుద్యోగులు తరలి రావాలని పిలుపు నిచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం, విద్యార్థి విభాగం, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న డాక్టర్ రవిబాబు బదిలీ అయ్యారు. ఈయన 2012 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా, ఏడీగా సేవలందించారు. పశులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. అలాగే ప్రభుత్వానికి చెందిన వివిధ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టారు. ఈయనను ప్రభుత్వం అనంతపురం జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులుగా నియమించింది. అనంతపురంలో ఉన్న ఎస్.రామచంద్రను కర్నూలుకు బదిలీ చేశారు.

ఓట్లు అడిగినప్పుడు దళితులని తెలియదా?

- దళిత సర్పంచ్‌కు అవమానంపై ఆదోనిలో భారీ నిరసన ప్రదర్శన



ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసననుద్దేశించి ప్రసంగిస్తున్న ఐక్యవేదిక నాయకుడు అజయ్‌బాబు


ఆదోని టౌన్: ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగిన కూటమి నేతలకు అప్పుడు దళితులనే విషయం తెలియలేదా అని దళిత, గిరిజన ఐక్యవేదిక హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక(జేఏసీ) నాయకులు ప్రశ్నించారు. ధణాపురం సర్పంచ్ చంద్రశేఖర్‌ను కులం పేరుతో అవమానించిన ఎమ్మెల్యే బి.పార్థసారధి, టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనను నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు, అక్కడి నుంచి తిరిగి భీమాస్ సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు అజయ్‌బాబు, వీరేష్, దేవదాస్, వై.పి.గంగాధర్, కల్లుబావి నాగేంద్ర, ప్రసాద్, మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, సుజ్ఞానమ్మ తదితరులు మాట్లాడారు. గ్రామ ప్రథమ పౌరుడిని జనం మధ్యలో కులం పేరుతో అవమానించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఒకరు క్రిష్టియనా అంటే, మరొకరు ఎస్సీ అని నోరు పారేసుకోవడంతో దళిత సమాజాన్ని అగౌరవపరచడమేనన్నారు. ఓట్ల కోసం దళితుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి కులం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బాధిత సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కులాన్ని ఎత్తి చూపడంతో తాను వేదికపైకి వెళ్లలేకపోయానన్నారు. వందలాది మంది గ్రామస్తుల సమక్షంలో తనను కులం పేరుతో అవమానం చేసిన కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు, ఇస్వీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు అందజేశారు. ఎమ్మెల్యే బి.పార్థసారధి, టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు, వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

28న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ముందుగా కోఆప్షన్ సభ్యునిగా ఎన్నికైన వారిని జెడ్పీ స్థాయీ సంఘ కమిటీల్లో సభ్యునిగా నియమించేందుకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. అనంతరం వ్యవసాయం-అనుబంధ శాఖలు, వైద్యం-ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విద్యపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి హాజరు కావాలని జెడ్పీటీసీ, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ఎంపీపీ, కేడీసీసీ, కేడీసీఎంఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నేటి(శనివారం)నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నగర శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలో జి.పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 27వ తేదీలోపు ఫీజులు చెల్లించాలి. ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 28వ తేదీలోపు చేయించుకోవాలి. కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూలై 1న ఆప్షన్లను మార్పులు చేసుకునేందుకు అవకాశం, 3న సీట్లు కేటాయింపు జరుగుతంది. విద్యార్థులకు ఏవైనా అనుమానాలు హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 9885940055 నంబర్‌ను సంప్రదించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.



క్లుప్తంగా

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ పూర్తయినందున సంఘాల లావాదేవీలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించే అవకాశం ఏర్పడిందని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ పి.రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం నంద్యాల జిల్లాలోని 56 పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తయిన నేపథ్యంలో సంఘాల సీఈఓలకు కర్నూలులో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది మార్చి 31 ఆడిట్ ఫైనల్ రిపోర్టులను, 2025 సంవత్సరానికి సంబంధించి ఇయర్ ఎండ్ ప్రాసెస్ మాడ్యుల్స్‌పై అవగాహన కల్పించారు. టెక్నికల్ సపోర్టు గురించి వివరించారు. ఎస్ఎల్‌పీఎస్‌వీ టెక్నికల్ సపోర్టర్ భువనేశ్వర్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నంద్యాల జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, అప్కాబ్ డీపీడీఎం నహిదా సుల్తాన, డీజీఎంలు సునీల్ కుమార్, నాగిరెడ్డి, డిపార్టుమెంటల్ ఆడిటర్స్, సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 79 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలన్ని ఈ ఏడాది జూలై 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో 32, నంద్యాల జిల్లాలో 47 పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా సహకార శాఖ అధికారులు పనిచేస్తున్నారు. వీరి పదవీ కాలం ఈ నెల 20వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో జూలై 30 వరకు పదవీ కాలాన్ని పొడిగిస్తూ సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చే నెల 15వ తేదీలోపు www.iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే నెల 17వ తేదీన జరుగనున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాలకు జూలై 21, 22, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాలకు 23 నుంచి 25వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య యోగం

- యోగాతో శారీరక ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత
- దీర్ఘకాలిక వ్యాధులు దూరం
- యోగాపై ప్రజల్లో పెరుగుతున్న మక్కువ
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): యోగా పట్ల ఇప్పటికీ దురభిప్రాయం ఉంది. ఇది ఒక వర్గం ప్రజలు మాత్రమే చేసే వ్యాయామమని ప్రచారం చేసేవారూ ఉన్నారు. ఇటీవల యోగాకు ఆదరణ పెరుగుతోంది. నిరంతరం యోగాభ్యాసం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆస్వాదిస్తూ ఇతరులకు కూడా చెబుతుండటంతో ఆచరించేవారు అధికమయ్యారు. ఒకప్పుడు కర్నూలు నగరంలో ఒకటి, రెండు మాత్రమే యోగా శిక్షణ కేంద్రాలుండేవి. ఇప్పుడు ప్రతి కాలనీలో ఒక కేంద్రం ఉంటోంది. ప్రతిరోజూ ఉదయాన్నే జిమ్, వాకింగ్‌కు వెళ్లే వారున్నట్లే యోగా కేంద్రాలకు వెళ్లేవారూ పెరిగారు.

గురువు సమక్షంలోనే మేలు

చాలా మంది వారి బిజీ జీవితం వల్లో, ఇతర కారణాలతోనే యోగా శిక్షణ కేంద్రాలకు వెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారా చూసి యోగాను అభ్యసిస్తున్నారు. అయితే కొంతకాలం గురువు సమక్షంలో యోగాను నేర్చుకుని ఆ తర్వాత ఇంటి వద్దే సొంతంగా అభ్యాసం చేయాలని శిక్షకులు సెలవిస్తున్నారు. ఎందుకంటే యోగా కేంద్రంలో ఏ వ్యాధికి ఏ ఆసనం, ప్రాణాయామం, యోగముద్రలు వేయాలో గురువులు స్పష్టంగా అర్థమయ్యేటట్లు చెబుతారు. దీంతో పాటు వారి ఆరోగ్య అవసరాలను బట్టి ఎవరు ఏ ఆసనాలు, ప్రాణాయామాలు చేయవచ్చో సూచిస్తారు. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు రాకుండా యోగాను కొనసాగించవచ్చు.

యోగాతో పలు వ్యాధులు దూరం

ఆధునిక జీవితంలో చాలా మంది శారీరక వ్యాయామం లేక, సీట్లకే పరిమితమైన ఉద్యోగాలు చేస్తూ స్థూలకాయులైపోతున్నారు. దీనికితోడు కల్తీ ఆహారం, జంక్, ఫాస్ట్‌ఫుడ్‌లు శరీరాన్ని నాశనం చేస్తున్నాయి. వీటి ద్వారా వచ్చే రోగాలను తగ్గించుకునేందుకు వైద్యుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెజబ్బులు, ఆస్తమా, గ్యాస్ట్రబుల్, సయాటికా, మెడనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, మలబద్ధకం, స్థూలకాయం వంటి సమస్యలన్నింటికీ యోగాతో చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు. యోగాసనాలు, ప్రాణాయామం చేస్తూ ఆహార వ్యవహారాల్లో నియంత్రణ పాటించేవారు నిత్యం ఆరోగ్యంగా ఉంటారని నమ్ముతున్నారు.

జీవనశైలి మారుతోంది

జీవనశైలి మార్పు వల్లే దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయనేది ఇప్పుడు బహిరంగ రహస్యం. దీన్ని అధిగమించేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయడం ఉత్తమం. అందులో భాగంగా రోజూ ఉదయాన్నే గంట నుంచి గంటన్నర పాటు యోగాసనాలు వేయడం, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం చేస్తున్నారు. మెనూలో వరి అన్నం తగ్గిపోయి కొర్రలు, రాగులు, అరికెలు, జొన్న రొట్టెలు చేర్చుకుంటున్నారు. ఏ ఆహారాన్నైనా కడుపు నిండా గాకుండా కాస్త మితంగా తినడం అలవాటు చేసుకున్నారు. మాంసాహారాన్ని సైతం మితంగా తింటున్న వారు పెరుగుతున్నారు. ఆహారపు వేళలను కచ్చితంగా పాటించేవారూ అధికమవుతున్నారు. ఈ మేరకు కార్యాలయాలకు, ఎగ్జిక్యూటివ్ జాబ్‌లకు వెళ్లేవారు వెంట క్యారియర్లు తీసుకెళ్తున్నారు. ఎంత పని ఉన్నా వేళకు భోజనం చేస్తే జీర్ణకోశ వ్యాధులు దూరం అవుతాయని వారు నమ్ముతున్నారు.

30 ఏళ్లుగా యోగా శిక్షణ



1982లో నాకు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. స్నేహితుల సలహాతో వారం రోజుల పాటు యోగా చేసి తగ్గించుకున్నాను. ఆ తర్వాత సికింద్రాబాద్‌లో యోగా గురువు సూరిరాఘవ దీక్షితుల వద్ద, అనంతరం కర్ణాటకలోని శివమొగ్గలో ఉన్న రాఘవేంద్ర స్వామీజీ వద్ద 30 రోజుల శిక్షణ పొందాను. 1991లో గుజరాత్, గాంధీనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్, డిప్లొమాలో యోగా చేశాను. కర్నూలులో శ్రీ వాల్మీకి యోగా కేంద్రం ద్వారా 30 ఏళ్లుగా ప్రజలకు యోగాను నేర్పిస్తున్నాను. ఇందులో సాధారణ ప్రజలతో పాటు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఉన్నారు. నా సేవలకు డాక్టరేట్‌లు, భారత యోగ శిరోమణి, గురుబ్రహ్మ వంటి అవార్డులు దక్కాయి.

– టీటీ జయలక్ష్మి, యోగా శిక్షకురాలు, శ్రీ వాల్మీకి యోగా కేంద్రం, కర్నూలు

శరీరం, మనస్సును సమన్వయం చేస్తుంది



మనసు చెప్పిన మాట శరీరం వినదు. శరీరం చెప్పిన మాట మనసు వినదు. ఈ రెండింటినీ సమన్వయం చేయడమే యోగా. నేను 14 ఏళ్లుగా ఉచితంగా యోగా నేర్పిస్తున్నాను. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శరీరం దృఢంగా, మనసు స్థిరంగా ఉంచుకోవడానికి అవకాశం ఉంది. యోగా మనసుకు శాంతి, శరీరానికి దృఢత్వం, చిత్తానికి ఓర్పు చేకూర్చే అద్భుత ప్రక్రియ. శరీరంలో మూసుకుపోతున్న ద్వారాలన్నీ తెరుచుకుంటాయి. శరీరంలో ఎంజైమ్‌లు, హార్మోన్‌లు ఉత్తేజితం అవుతాయి. బరువును నియంత్రణలో ఉంచుతుంది. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను, సయాటిక, థైరాయిడ్, కిడ్నీ, లివర్‌కు సంబంధించిన జబ్బులను నివారిస్తుంది.

– ఎల్.నరేష్‌గౌడ్, యోగా శిక్షకులు, కర్నూలు



యోగా అభ్యసిస్తున్న జిల్లా అధికారులు, ప్రజలు

రెవెన్యూ ఉద్యోగులు సేవాభావంతో పనిచేయాలి



హాజరైన రెవెన్యూ ఉద్యోగులు



రక్తదానం చేసిన ఉద్యోగికి సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ ఉద్యోగులు సేవాభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని, అప్పుడు ఆ ఉద్యోగానికి గుర్తింపు ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రెవెన్యూ డేను పురస్కరించుకొని ఏపీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్‌తో పాటు జేసీ డాక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీరాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఏపీఆర్ఎస్ఏ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలకు రెవెన్యూ తల్లివంటిదన్నారు. రెవెన్యూలో అనేక సంస్కరణలు వచ్చాయని, వాటిపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. తాను కడపలో డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణలో ఉన్న సమయంలో(2007–08) అనేక సంస్కరణలను అమలుచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నట్లు చెప్పారు. గుడివాడ ఆర్డీఓగా ల్యాండ్ రికార్డ్స్'లో ఆధార్‌సీడింగ్ ప్రక్రియను రూపొందించానన్నారు. కడప ఆర్డీఓగా కొప్పర్తిలో 6 వేలు, ఇళ్ల నిర్మాణాల కోసం 3వేల ఎకరాలు, 14రోడ్ల విస్తరణ భూసేకరణకు ప్రత్యేక యాప్‌ను తయారు చేసినట్లు గుర్తు చేసుకున్నారు. ఇప్పటికీ కడపకు వెళ్లినప్పుడు రోడ్ల విస్తరణ చూస్తే తనకు ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు.

➤ జేసీ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అతిప్రాచీనమైనదని, ఇప్పుడున్న మిగిలిన శాఖలన్నీ రెవెన్యూ నుంచే ఉద్భవించినవేనన్నారు. ప్రజలకు ఏమి కష్టాలు వచ్చినా రెవెన్యూ అధికారులనే ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలని సూచించారు.

➤ అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు శౌదేవి, కిష్టోఫర్, జయన్న, విజయుడు, హుస్సేన్, రమణ, ఆదినారాయణ, రామన్న, ఎల్లరాముడు తదితరులను ఏపీఆర్ఎస్ఏ తరపున కలెక్టర్, జేసీలు సన్మానించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, అజయ్‌కుమార్, కొండయ్య, నాగప్రసన్న, సునీతాభాయ్, ఏఓ శివరాముడు పాల్గొన్నారు.

నీటి విడుదలపై 27న సమావేశం

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీ, ఇతర కాలువలకు నీటి విడుదలపై ఈ నెల 27న బెంగళూరు విధాన సౌధలో ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారులు, నీటి సలహా మండలి సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులతో 124వ నీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు శుక్రవారం తెలిపారు. గతేడాది వరద నీటి ప్రవాహానికి డ్యాం 19వ క్రస్టుగేటు కొట్టుకుపోవడంతో స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే స్టాప్‌లాక్ గేటు స్థానంలో కొత్త గేటుతో పాటు మిగిలిన 32 క్రస్టుగేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు గాను పనులు మొదలు పెట్టేందుకు ఒక పంటకు (ఖరీఫ్) మాత్రమే నీరిచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందే. అయితే దీనిపై కర్ణాటకలోని తుంగభద్ర రైతు సంఘం నాయకులు, రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేపడ్తామని హెచ్చరికలు చేస్తున్నారు. డ్యాంలో కూడా 40 టీఎంసీల నీరు చేరడంతో కాలువలకు ముందుగానే నీటిని విడుదల చేయడం, రైతుల వ్యతిరేకత, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని డ్యాంలో నిల్వ అయ్యే నీటితో ఆయా రాష్ట్రాల కాలువలకు నీటి విడుదల, కేటాయింపులపై చర్చించనున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది టీబీ డ్యాం నీటిపై గందరగోళం నెలకొనడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం టీబీ డ్యాంలో 1612 అడుగుల వద్ద 44 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



టీబీ డ్యాం

ఔదార్యం చాటుకున్న 'తల్లి'కి వందనం



డబ్బులు అందజేస్తున్న కుమారి

ఉయ్యాలవాడ: పేద కుటుంబమైనప్పటికీ తన బ్యాంకు ఖాతాలో జమైన మరో తల్లికి చెందిన 'తల్లికి వందనం' డబ్బును తిరిగిచ్చి ఓ మహిళ ఔదార్యం చాటుకుంది. వివరాలు.. ఉయ్యాలవాడ మండల ప్రజా పరిషత్ పాఠశాల(మెయిన్)లో గ్రామానికి చెందిన కుమారి కుమారుడు శివ సాత్విక్, పావని కుమారుడు పవన్ గౌతమ్ 2వ తరగతి చదువుతున్నారు. ఆ ఇద్దరు పిల్లలకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన 'తల్లికి వందనం' డబ్బులు కుమారి ఖాతాలో రూ.26 వేలు జమ అయ్యాయి. దీంతో తనకు సంబంధం లేని డబ్బులు తనకు వద్దని కుమారి శుక్రవారం పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి సమక్షంలో పావనికి నగదు అందజేశారు. రాజు, కుమారి దంపతుల నిజాయితీని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఆదామ్, మహబూబ్ బాషా, రాజు మెచ్చుకుని వారిని అభినందించారు.

పట్టపగలే చోరీ

- 6 తులాల బంగారు నగలు, రూ.2 లక్షల నగదు అపహరణ

ఓర్వకల్లు: మండలంలో గురువారం పట్టపగలే ఓ ఇంట్లోకి చొరబడిన దుండగులు అందినకాడికి దోచుకెళ్లిన సంఘటన మీదివేముల గ్రామంలో చోటుచేసుకొంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామేశ్వరరెడ్డి వ్యయసాయ పనులు చేస్తుండగా, భార్య కళావతి స్థానిక అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌గా పనిచేస్తోంది. రోజులాగే ఇంటికి తాళం వేసి, వారి కూతురి పిల్లలను పక్కంటి వారి వద్ద వదిలి తమ పనుల నిమిత్తం వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువా తలుపు పెకిలించి అందులోని 6 తులాల బంగారు నగలు, రూ.2 లక్షల నగదును అపహరించుకెళ్లారు. పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో పొరుగింటి వారితో చెప్పగా వారు ఇంటి యజమానులకు విషయం తెలియజేశారు. వారు ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సునీల్‌కుమార్ గ్రామానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.



బీరువా తలుపు పెకిలించి చోరీ చేసిన దృశ్యం

గ్రిల్‌లో ఇరుక్కుని నరకయాతన

ఎమ్మిగనూరురూరల్: వైద్యం కోసం వచ్చిన మహిళ కాలు ఆస్పత్రి గేటు వద్ద గ్రిల్‌లో ఇరుక్కోవడంతో అరగంట పాటు నరకయాతన అనుభవించింది. వివరాలు.. మండల పరిధిలోని కోటేకల్ గ్రామానికి చెందిన మునెమ్మ అనే మహిళ కాలికి దెబ్బతగడంతో చికిత్స కోసం శుక్రవారం ఎమ్మిగనూరు ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. కట్టు కట్టించుకొని బయటకు నడిచి వస్తుండగా ఆటో ఎదురుగా రావటంతో గ్రిల్ మీద నిల్చున్న మహిళ కాలు జారి ప్రమాదశాత్తు ఇరుక్కుపోయింది. దెబ్బతగిలిన కాలు గ్రిల్‌లో ఇరుక్కొని కేకలు వేయటంతో అక్కడి వారు వచ్చి ఎంతగా ప్రయత్నించినా బయటకు తీయలేకపోయారు. చివరకు ఇనుప కడ్డీలు కట్ చేసే కట్టర్‌ను తీసుకొచ్చి గ్రిల్ కడ్డీని కట్ చేసి మహిళను బయటకు తీశారు. ప్రభుత్వాసుపత్రిలోకి ఆటోలు, అంబులెన్స్‌లు ఇష్టానుసారంగా వస్తుండంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి గేటు వద్ద పాడైపోయిన గ్రిల్‌ను బాగు చేయించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మిగనూరు ఆస్పత్రి గేటు వద్ద గ్రిల్‌లో ఇరుక్కున్న మహిళ కాలు

కూటమి పాలనలో ఒరిగిందేమీ లేదు



కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీల అమల్లో ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో కూటమి ఏడాది పాలనపై సీపీఎం బుక్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అధికారంలోకి రావడం కోసమే రాష్ట్ర ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రజలను మభ్యపెట్టడానికే 143 వాగ్దానాలు చేశారన్నారు. తల్లికి వందనం అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌కు కేంద్రం ఇచ్చిన నిధులు తప్పా ఒక్క రూపాయి కేటాయించలేదని, వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్ల ప్రస్తావనే లేదని, హంద్రీనీవా నత్తడనకన సాగుతోందన్నారు. జిల్లా ప్రాజెక్టులు పట్టించుకోకుండా బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని అంటున్నారని, ఇదంతా నాటకమేనని మండిపడ్డారు. రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేయలేని, అప్పుడు స్మార్ట్ మీటర్లను వద్దని, ఇప్పుడు బలవంతంగా పెట్టిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.100 కోట్ల ఉపాధి బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. డీఎస్సీలో సగం పోస్టుల్లో కోత పెట్టారని విమర్శించారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఇప్పటికైనా ప్రజలకు మేలు చేయాలని సూచించారు.సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడని ప్రశ్నించారు. వైన్ షాపులు బార్లలా మారిపోయాయని, రోడ్లపైనే తాగుబోతులు తాగి తూళుతుండడంతో మహిళలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, కేవీ నారాయణ, టి.రాముడు, ఓల్డ్ సిటీ కార్యదర్శిరాజశేఖర్ పాల్గొన్నారు.

విజయేంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

హొళగుంద: మండల కేంద్రంలోని కోట ఆంజనేయ స్వామి ఆలయంలో వెలసిన విజయేంద్రతీర్థుల 411వ ఆరాధనోత్సవాలు శుక్రవారం నుంచి స్థానిక అర్చక బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి ధ్వజారోహణం, ప్రార్థనోత్సవం, గోపూజ, లక్ష్మీపూజ, శాఖా–ధాన్యోత్సవ పూజ, స్వస్తివాచన, మహామంగళారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు పూర్వారాధన, ఏకాదశి, మధ్యారాధన, ఉత్తరాధన తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. 24న ఉత్తరాధన రోజు స్వామి రథోత్సవం, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు శ్రీపురందరదాసర భజన మండళి, భక్తి భారతి కోటాల మండళి బృందాలతో భజనాలు, కోలాట కార్యక్రమంతో పాటు స్వామి వారికి స్వస్తివాచన, మహా నైవేద్యం తదితర కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని విజయీంద్ర తీర్థుల సేవా ట్రస్ట్ సభ్యులు పవనాచారి, రఘునాథాచారి, పాండురంగాచారి, మురళీధరాచారి, వెంకటేశాచారి, రాఘవేంద్రాచారి తెలిపారు.



రాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మూల విరాట్‌లు

జాతి వైరం మరచి.. తల్లిలా లాలించి



కుక్క పిల్లలకు పాలు ఇస్తున్న వరాహం

శునకం, వరాహం ఈ రెండు మూగ జీవాల మధ్య జాతి వైరం తీవ్రంగా ఉంటుంది. రెండు తారసపడితే శత్రుత్వం ప్రదర్శిస్తాయి. సహజంగా పందులు కనిపిస్తే కుక్కలు వెంటబడి తరిమేస్తాయి. కుక్క పిల్లలు కనిపిస్తే పందులు కసితీరా గాయపర్చుతాయి. ఇలాంటి జాతి వైరం ఉన్న జంతువుల మధ్య మాతృప్రేమ వికసించింది. శుక్రవారం అంకిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలోని రామాలయం ఆవరణలో ఈ అరుదైన దృశ్యం కనిపించింది. ఓ వీధికుక్క పిల్లలకు జన్మనించింది. తల్లి కుక్కను ఇతర కుక్కలు కరవడంతో తీవ్రంగా గాయపడి కొద్ది రోజుల నుంచి పిల్లల వద్దకు రాకుండా దూరంగా ఉంటుంది. చిన్న వయసులో ఉన్న కుక్క పిల్లలు ఆకలితో అలమటిస్తున్నాయి. ఈ సమయంలో వరాహం అక్కడికి చేరడంతో కుక్క పిల్లలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా పాలు తాగడం ఆరంభించాయి. వరాహం కూడా కుక్క పిల్లలను ఏమీ అనకుండా కట్టు కదలకుండా పాలు ఇచ్చి అమ్మలా ఆకలి తీర్చింది. ఈ దృశ్యాన్ని కాలనీ వాసులు చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు.

– కొలిమిగుండ్ల

WANTED TEACHERS

S.NO	CATEGORY	SUBJECT
1	PRE-PRIMARY	ENGLISH & MATHEMATICS
2	PRIMARY	ENGLISH, EVS, SOCIAL
3	HIGH SCHOOL	ENGLISH, SOCIAL, IIT PHYSICS
		PRINCIPAL, VICE-PRINCIPAL, COORDINATOR

ART & CRAFT, PET (FEMALE), HOSTEL WARDENS (FEMALE)
PAY SCALE: 15K TO 50K
DATE & TIME: 22/06/2025 (SUNDAY) 10:00 am to 5:00 pm
Venue: BANSAL COLLEGE,Dr.Anandams Aditya Arcade, Beside V.R. Hospital, Prakash Nagar, Kurnool.
23/06/2025 (MONDAY) 10:00 am To 5:00 pm
Venus: Shree Saraswathi International School (AC Campus), Yerravally
Transportation Is Available For The Selected Candidates.
Distance: Shre Raghavendra High School To Kurnool :25 Km.
Shree Saraswathi International School To Kurnool 35 Km.
For more details contact:9666806789, 8074329290

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ఆర్.ఆర్.హై స్కూలు, మద్దూర్ నగర్, కర్నూలు వారి ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున 1వ తరగతి నుండి 10వ తరగతి పేద విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించబడును. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఫీజులో 50% రాయితీ ఇవ్వబడును. సంప్ర: ఉమాదేవి. సెల్: 9440290162. [SCA25004967]

TUITIONS

■ Inter CEC, MEC, B.Com, CA / CMA - Foundation & Intermediate - Tuitions Dr.K.Gopal. Details contact: 83339 48638. [SCA25004977]

REAL ESTATE

LAND FOR SALE

■ కర్నూలు-నంద్యాల రోడ్డు, హుసేనాపురం, పంచాయతీ పరిధిలో హైవేకు, స్టీల్ ప్లాంటుకు దగ్గరలో సర్వే నెం: 425, 6.06 ఎకరాల భూమి, వెంచర్లకు అనుకూలమైన భూమి అమ్మబడును. డైరెక్ట్ ఓనర్: 63002 65849. [SCA25005286]

TO - LET

■ కర్నూలు ఎ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్ మెయిన్ రోడ్ 3000 చ.అ. విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ & 3000 చ.అ. విస్తీర్ణంలో 1వ ఫ్లోర్‌ను వ్యాపార సముదాయముకు బాడుగకు ఇవ్వబడును. కారు పార్కింగ్, ద్విచక్ర పార్కింగ్ కలదు. సెల్: 98853 25456. [SCA25005290]

WANTED

■ కర్నూలులోని ప్రముఖ హాస్పిటల్‌లో జాబ్ చేయుటకు డ్యూటీ డాక్టర్స్ (BHMS/BUMS), స్టాఫ్ నర్స్ (GNM) కావలెను. సెల్: 94914 91911. [SCA25005171]

■ బ్రేక్ త్రూ EM స్కూల్, శరీన్ నగర్, కర్నూలు. హైస్కూలుకు ఇంగ్లీష్, సైన్స్, సోషల్ బోధించుటకు లేడీ టీచర్లు మరియు పనిచేయుటకు వాచ్‌మెన్‌లు కావలెను. సెల్:85007 79895, 83743 37750 [SCA25005152]

■ శ్రీ శక్తి Co-Operative Society నందు పనిచేయుటకు Field Staff కావలెయును. Qly: Any Degree, Sal 15-18K, Address: I Con Shoppee Complex, 4th Floor, Birla Compound (Union Bank Complex), Ph: 83413 80122, 95027 66466 [SCA25005146]

■ Wanted experienced qualified teachers for maths and social for higher classes. keerthi high school, Kavadi street, kurnool. cell: 8985024254. [SCA25005264]

■ Tele Callers (girls) Qly : degree Salary:-15k (with incentive), Adress:- Ballary Chowrastha, Skandhanshi Complex, D Mart beside, Kurnool. Contact: 93912 20645, 90636 43092. [SCA25005155]

■ స్పాట్ జాయినింగ్ తిరుపతిలో మా కంపెనీ నందు టెలికాలర్స్ (Female) 7 మరియు మీ జిల్లాలో వర్క్ చేయుటకు PRO's (10 Nos) కావలెను. Q: SSC to PG. Sal: 15000 to 20000+ఫ్రీ పీజీ సౌకర్యం జీతం. 82979 22999 [2485]

■ Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు పంపుటకు స్త్రీ/పురుషులు కావలెను. వారానికి 3500 సంపాదించుకోండి వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి వివరాలకు కాల్ చేయండి. Cell: 82478 08801 [SCA25005052]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-15934]

■ SRED PU Programme (HIV/AIDS) పోస్ట్: MECA, Qualification : B.Com, Economics, salary: 16,000/- +T.A. 600/-, Interview : 22-06-2025, అడ్రస్: గణేష్ నగర్, కర్నూలు. వివరాలకు సంప్రదించండి సెల్: 72071 74273. [SCA25005266]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640468899, 9640258899 [SCA25005265]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

